# పద్మశ్రీ

'దేనికీ కొదవలేనిదిరా మనదేశం! భారతదేశంలో అన్నీ ఛీపే! ఇంటిఅద్దె చౌక. కరెంట్ మంచినీరు బహు చౌక. ఇహపోతే... డీజిలు... పెట్రోలు... కూరగాయలు... బియ్యం... పప్పుదినుసులు... వగైరా కారుచౌక! రోడ్లమీద కుప్పలు పోసి అమ్ముతున్నారు. అరుదుగా దొరికేవల్లా... బిరుదులు... డాక్టరేట్లు! నువ్వో పొలిటికల్ లీడర్‌ని పట్టుకోగలిగావంటే అవీ వచ్చి నీ వడిలో వాల్తయ్....'' గుక్క తిప్పుకోకుండా మాట్లాడిన సత్యం గొంతు తడి ఆరిపోయిందో ఏమో ఎదురుగా టీపాయ్ మీదున్న మంచినీళ్ళ గ్లాసు ఎత్తి గొంతులో కుమ్మరించుకుని బ్రేవ్‌మని త్రేన్చాడు.

'ఇదిగో ఉపన్యాసాలిచ్చే వాళ్ళంటే నాకు మండుద్ది! చేతనైతే ఓ మంచి సలహా ఇవ్వు! అంతేగాని బేవార్స్ మాటలొద్దు...' వళ్ళు మండింది గాడిద (ఇంటిపేరులెండి) శ్రీరామ్‌కి.

'అరడజను కథలు... పది కవితలు... రెండు నవల్స్ రాయగానే నీకు పద్మశ్రీ బిరుదు ఇచ్చేస్తారేమిట్రా పిచ్చి నన్నానీ? ఇవేం పకోడీలా వంచిపెట్టడానికి?... ఏదైనా కళలోనిష్ణాతులైనవారికి గానీ 'పద్మశ్రీ' ఇవ్వర్రా పిచ్చివాడా... నటులకు గాయకులకు... మ్యూజిషియన్స్‌కు... అనన్య సామాన్యమైన కృషి సలిపిన వారికే అది ప్రాప్తిస్తుంది. అండ్రస్టాండ్! పోనీ డాక్టరేటైనా నీకు ఇప్పిద్దామా అంటే ఏ యూనివర్సిటీ వీ.సీ. మనకు తెలిసినవాడు లేకపోయే...? ఏం చేస్తాం? నీ ఖర్మ! నేను అమెరికా వెళ్ళి తిరిగొచ్చేక పద్మశ్రీ బిరుదు నీకు వచ్చేలా ట్రై చేస్తాను. అంతవరకు ఓపికపట్టు... శ్రీరామ్ వీపు తట్టి బుజ్జగించాడు సూర్యం.

శ్రీరామ్ తనకెలాగైనా 'పద్మశ్రీ' వస్తే బావుండుననేసి బోలెడంత ఆశపడిపోతున్నాడు. ఇతగాడు కేంద్ర ప్రభుత్వోద్యోగి! బొత్తిగ ఇన్‌ఫ్లూయెన్స్‌లేని అర్భకుడు. ఆశ బారెడు అదృష్టం జానెడు అనే సామెత వీడిపట్ల నూటికి నూరుపాళ్ళు వర్తిస్తుంది.

సూర్యం డిగ్రీ అయ్యాక కంప్యూటర్ కోర్స్ చేసి ఓ మాంచి కంపెనీలో పెద్ద శాలరీతో జాబ్‌చేస్తున్నాడు. త్వరలో ఒక ఏడాదిపాటు కంపెనీ ఇతగాడిని అమెరికా పంపే యోచనలో వుంది. వెళ్ళటం ఎప్పుడెప్పుడాని మీనమేషాలు లెక్కిస్తున్నాడు.

వీరిద్దరిదీ విడదీయరాని బంధం! ఛైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్!

★★★★★

సూర్యం అమెరికా వెళ్ళి రాగానే ఎప్పుడెప్పుడు తన ప్రియాతిప్రియమైన మిత్రుడు గాడిద శ్రీరామ్‌ని కలవటమనే తొందర్లో ఫ్రెండ్ ఇంటిమీద కాకిలా వాలాడు.

'కావుకావు' మంటూ కేకేసి కాలింగ్‌బెల్ నొక్కేలోపు... ఇంటి తలుపు పక్కగా శ్రీరామ్ నేమ్‌బోర్డ్ కళ్ళబడింది.

'పద్మశ్రీ గాడిద శ్రీరామ్...' అని నేమ్‌బోర్డ్ మీదరాసి వుండటం చూచిన సూర్యానికి మూర్ఛవచ్చినంత పనయింది.

ఓరి వీడిదుంపతెగ... నేను దేశంలో లేని సమయంలో 'పద్మశ్రీ' బిరుదు కొట్టేశాడన్నమాట! మొత్తానికి మహర్జాతకుడు. వాడు కన్న కలలు ఫలించినయ్... ఇహ వీడు భూమ్మీద నడవడు. మహామహుల లిస్టులో చేరిపోయాడు. తన్లాంటి పూర్‌ఫెలోతో శ్రీరామ్ మాట్లాడతాడో లేదో... రకరకాల ఆలోచనలు సూర్యం మస్తిష్కాన్ని తొలిచి కలవరపెట్టేస్తున్నాయ్.

తలుపు తట్టకముందే... కాలింగ్‌బెల్ నొక్కకముందే వీధి తలుపు భళ్ళున తెరుచుకుంది.

గడపలో నిలబడ్డ సూర్యాన్ని చూస్తూ 'ఓరి నీ... నువ్వెప్పుడొచ్చావురా అమెరికా నుండి?' అంటూ అమాంతం కౌగలించుకున్నాడు శ్రీరామ్.

ఆ పిలుపుకి... చూపిన ఆప్యాయతకు సూర్యం తనువు పులకించింది. నోట మాట రాలేదు.

ఇద్దరూ లోపలికి నడిచారు.

'అవున్రా శ్రీరామ్! మొత్తానికి నువ్ దేవాంతకుడివి! నేనులేని సమయంలో మొత్తానికి 'పద్మశ్రీ' బిరుదు కొట్టేశావ్!... సారీ... సాధించావ్...' అభినందించాడు సూర్యం.

'ఇంకో సర్‌ప్రైజ్ న్యూస్ చెప్పనా... నువ్వటు అమెరికా ట్రిప్ వెళ్ళావో లేదో... సడన్‌గా నా మేరేజ్ ఫిక్సైంది. సమయానికి నువ్వు లేవేని బెంగపడ్డాను...' అంటున్నవాడల్లా కాఫీ కప్పులతో వచ్చి నిలబడిన లేడిపిల్లలాంటి అందమైన ఆడపిల్లని చూపిస్తూ 'మీట్ మై వైఫ్ శ్రీపద్మ...' ఇంట్రడ్యూస్ చేసాడు.

కాఫీ కప్పు అందుకుని 'రెండు సర్‌ప్రైజ్‌లన్నమాట!' అంటూ సిప్ చేశాడు సూర్యం.

శ్రీరామ్ ఆ ఏడాది కాలంలో కొంచె వొళ్ళుచేసినట్టు కన్పించాడు.

ఈ వెధవాయ్‌గాడు... అదేం గాడిద శ్రీరామ్... సారీ... పద్మశ్రీ గాడిద శ్రీరామ్.. పిల్లకాకిగా వున్నరోజుల్లో వుండేలు దెబ్బలు తిన్నాడు. గండాలు గడిచి బైటపడ్డాడు.

ఒకటి రెండుసార్లు ఐ.టీ.దాడులు కూడా జరిగాయి. మీనరాశివాడు కావటాన... వాళ్ళకి దాడుల్లో దొరికిపోకుండా ఎస్కేప్ అయ్యాడు. చావుతప్పి కన్ను లొట్టపోయినంత పనైంది. ఎందుకు రైడ్ చేశామాని ఐ.టీ.వారు నెత్తినోరు బాదుకున్నారు.

చదువుకునే రోజుల్లో సంగీతంమీద వుండే ఆసక్తితో సినిమాపాటలు అద్భుతంగా పాడుతూ చాలాసార్లు పాటకచేరీలూ నిర్వహించాడు.

డిగ్రీ అవగానే హీరో ఛాన్స్ వెతుక్కుంటూ రావటంతో మద్రాసెళ్ళి కొన్నాళ్ళు అక్కడున్నాడు. వీడి లక్ బాగుండలేదో ఏమో ఆ పిక్చర్ షూటింగ్ సగంలోనే ఆగిపోవటంతో వెనక్కి తిరిగొచ్చి జాబ్‌లో చేరాడు. నాటకాలు వేయటంలోనూ ప్రముఖ పాత్రలు ధరిస్తూ... దర్శకత్వం వహిస్తూ

అనేకానేక నాటక పోటీల్లో పాల్గొని బహుమతులూ పొందేడు.

రచయితగా రంగప్రవేశం చేసి మంచి నవలాకారుడు కథకుడూ అయినాడు.

శ్రీరామ్ వున్నాడే... మాస్టర్ ఆఫ్ ఆల్‌ట్రేడ్స్!

అలాంటి శ్రీరామ్ పేరుముందు పద్మశ్రీ అవుపించడంతో సన్మానాలు సత్కారాలు సంఖ్య పెరిగింది. టి.వి. ఛానళ్ళవారు ఇంటర్వ్యూలు చేశారు.

అభిమానసంఘాల వారంతా ఏకమై పద్మశ్రీ గాడిద శ్రీరామ్‌కు పేర సన్మానం చేయ సంకల్పించారు.

సదరు సన్మానానికి ముఖ్యఅతిథిగ రాష్ట్రముఖ్యమంత్రిగారు విచ్చేసి గజమాలతో శ్రీరామ్‌ని పూలమాలాంకృతులను చేసి శాలువా కప్పి... కాలికి గండపెండేరం తొడిగి నిలువెత్తు సన్మానపత్రం అందించారు.

గజారోహణం కార్యక్రమం మొదలైంది. ఏనుగు ఎక్కి తిరగాలంటే శ్రీరామ్‌కి మొదట్లో భయం వేసింది. అదెక్కడ కిందపడేస్తుందో... తొండంతో విసిరికొడుతుందోని జంకేడు.

తీరా ఇంతదూరం వచ్చాక తాను ఏనుగు ఎక్కనంటే పిరికివాడనేసి అందరూ నవ్విపోతారేమోనని ధైర్యాన్ని కూడదీసుకుని ఎలాగో అలా తంటాలుపడి ఏనుగుమీదికి ఎక్కి హమ్మయ్య అనుకుని గట్టిగా ఊపిరిపీల్చుకున్నాడు.

ముందు బ్యాండ్‌మేళం... ఇరువైపులా బారులు తీరిన అభిమాన సందోహం... రోడ్డుపై వెళ్ళే వాహనాల హారన్ మోతలకు.. బెదిరిన ఏనుగు చికాకు పడిపోతూ... దిక్కుతోచక అటు ఇటు పరుగెత్తింది. మావటివాడు... శ్రీరామ్ ఇద్దరూ ఆ కుదుపులకు 'దభీ'మని కింద పడ్డారు.

ఆ పడటంతో పద్మశ్రీ గాడిద శ్రీరామ్ నడ్డిపూస చిట్లటంతో ఆస్పత్రి పాలై నెల్లాళ్లు కట్టు కట్టించుకుంటూ బెడ్‌మీదే వున్నాడు.

ఈ దిక్కుమాలిన గజారోహణ కార్యక్రమానికి అంగీకరించకున్నా బావుండేదని తనలో తాను కుమిలిపోయాడు.

★★★★★

సదరు గాడిద శ్రీరామ్ అనబడే రచయిత నటుడు గాయకుడుకి 'పద్మశ్రీ' బిరుదు ప్రభుత్వం గౌరవపదంగా ఇవ్వబడినదికాదని... తానంతట తానుగ ఆ బిరుదును తనపేరు ముందు చేర్చుకుని అటు భారత ప్రభుత్వాన్ని ఇటు ప్రజలను ఛీట్ చేశాడనే ఫిర్యాదు చేయగా... ఈ విషయాన్ని లోతుగా విచారణ జరపవలసిందిగా హైకోర్ట్ సిట్టింగ్ జడ్జిని ఆదేశించడం జరిగింది.

విషయం తెలుసుకున్న గాడిద శ్రీరామ్‌లో దుఃఖం కట్టలు తెంచుకుంది. బావురుమన్నాడు. గుండెలు బాదుకున్నాడు. తనకి జరిగిన అన్యాయానికి ఇంటిపై కప్పు కూలేలా గాడిదలా

ఓంఁడ్రపెట్టాడు.

వీధులన్నీ శ్రీరామ్ కన్నీటితో పొంగిపొర్లినయ్. కాలంగాని కాలంలో వర్షమైన కురవకుండానే వీదులన్నీ జలమయం కావటమేమిటాని జలవనరుల శాఖామాత్యులు మరబోటు తెప్పించుకుని వందిమాగధులతో అందులో (మరబోటులో) జంటనగరాలు విహరించి చివరికి గాడిద శ్రీరామ్ అనబడే కళాకారుడి వలననే ఇంతటి జల ప్రళయం సంభవించిందనే నిజాన్ని గ్రహించారు.

హైకోర్ట్ సిట్టింగ్ జడ్జిగారు... సదరు గాడిద శ్రీరామ్ అనబడే కళాకారుడికి సమన్లు జారీ చేసి తన ఎదుట వెంటనే హాజరు కమ్మన్నారు.

సమన్లు అందుకున్న శ్రీరామ్ భయంతో వణికిపోతూ సుడిగాలిలా వెళ్ళి న్యాయమూర్తి ఎదుట ప్రత్యక్షమైనాడు.

'అయ్యా! దేవుడి సాక్షిగ... మీ సాక్షిగ... రామాయణ భారత భాగవతాల సాక్షిగ... వాటిని వ్రాసిన వాల్మీకి మహామునులు ఆదిగా గలవారి సాక్షిగ అంతా నిజమే చెప్తాను. అబద్ధం ప్రాణం పోయినా చెప్పను...' అని లెంపలు వాయించుకుని రెండు చేతులతో నెత్తిన మొట్టికాయలేసుకున్నాడు.

'చెప్పండి. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన... గౌరవప్రదమైన 'పద్మశ్రీ' బిరుదు ప్రభుత్వం మీకు ఇచ్చినమాట వాస్తవమా?' న్యాయమూర్తి ప్రశ్న.

'కోర్టువారు నన్ను క్షమించాలి! నా తెలివితక్కువతనాన్ని (అతి తెలివి) మన్నించాలి! పద్మశ్రీ గొడవ సునామీలా ఇంతపెద్ద ఎత్తున విరుచుకుపడే విషఘడియలు దాపురిస్తాయని వూహించనైనాలేదు...'

'నువ్వు ఏడ్చి మొత్తుకున్నా ప్రయోజనం వుండదు. ఈ బిరుదు నీకెలా వచ్చిందో ముందు అది చెప్పు?' న్యాయమూర్తి పులిలా గాండ్రించాడు.

'ఏం చెప్పమంటారు మహాప్రభో! నాకు 'పద్మశ్రీ' బిరుదు రావాలని కలలు కన్నాను. పూజలు చేశాను. పుణ్యతీర్థాలు సేవించాను. ఇన్ని ప్రయత్నాలూ వృథా అయినయ్! అసలేం జరిగిందంటే... మా తాతగారికి రావు బహద్దూర్ అనే బిరుదు వుండేది. అలాగే నా పేరుకు ముందు 'పద్మశ్రీ' వుండాలని ఆరాటపడ్డాను. కలలు కన్నాను. నాకు పెళ్ళి నిశ్చయమైంది. నా శ్రీమతి పేరు శ్రీపద్మ... దానిపేరు తలకిందులు చేసి 'పద్మశ్రీ' అనే భావం వచ్చింది కనుక నా పేరు ముందు అందంగా తగిలించుకున్నాను సార్! ఇందులో మోసంలేదు. కల్తీలేదు దగాలేదు...' భోరుమంటూ న్యాయమూర్తి ముందు సాష్టాంగ పడ్డాడు గాడిద శ్రీరామ్.

ఆ మాటలు విన్న న్యాయమూర్తి శ్రీరామ్ అతి తెలివికి నివ్వెరపోయి ఫకాలున నవ్వారు.

- సమాప్తం -